సాక్షి
ఖమ్మం

శుక్రవారం । 29 । సెప్టెంబర్ । 2023



ప్రశాంతంగా నిమజ్జనం
జిల్లాలో బుధవారం మొదలైన గణనాథుల నిమజ్జనం గురువారం వరకు కొనసాగగా ప్రశాంతంగా ముగిసింది. 8లో



గృహలక్ష్మితో మహిళలకు గౌరవం
గృహలక్ష్మి పథకాన్ని మహిళల పేరిటే మంజూరు చేసి వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం
జిల్లాలోని కొన్నిచోట్ల శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మిగతా ప్రాంతాల్లో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

బదిలీల్లో తప్పులు జరిగితే విద్యాశాఖదే బాధ్యత



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సందర్భంగా కొందరు తప్పుడు మార్గాల ఎంచుకోవడంతో అర్హులకు నష్టం జరుగుతోందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ తెలిపారు. ఈ విషయంలో పొరపాట్లను సరిచేయకపోతే విద్యాశాఖే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఈమేరకు డీఈఓ సోమశేఖరశర్మకు గురువారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సీనియారిటీ జాబితాలో పొరపాట్లు సరిచేశాకే తుది జాబితా విడుదల చేయాలని, భార్యాభర్తలకు ఒకే చోట పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు ప్రసాదరావు, నాగేశ్వరరావు, వెంగళరావు, శ్యాంసుందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలు విడుదల చేయండి

ముదిగొండ: పంటలను కాపాడుకునేందుకు సాగర్ జలాలను విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ముదిగొండ మండలం వెంకటాపురంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలోని పంటలకు నీరందక ఎండిపోయే దశకు చేరుకున్నాయని తెలిపారు. ఇకనైనా నీరు విడుదల చేయకపోతే రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదమున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. నాయకులు రాయల వెంకటేశ్వరరావు, భాస్కర్ రావు, వాసిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

‘మిషన్ భగీరథ’పై ప్రజాభిప్రాయ సేకరణ



గోపాలపురం వాసులతో మాట్లాడుతున్న అధికారులు

కామేపల్లి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం అమలుపై గ్రామస్థాయిలో జల్ జీవన్ మిషన్ అధికారుల బృందం అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ సందర్భంగా అధికారులు గురువారం కామేపల్లి మండలంలో పర్యటించారు. అకాడమీ ఆఫ్ మేనేజిమెంట్ సర్వీసెస్ ఆధ్వర్యాన రాష్ట్ర కోఆర్డినేటర్ సందీప్‌కుమార్, రీజినల్ కోఆర్డినేటర్ మధుకర్ మండలంలోని గోపాలపురం, బాసిత్‌నగర్ గ్రామాల్లో పర్యటించి మహిళలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అలాగే, నీటి సరఫరా, వినియోగం, క్లోరినేషన్‌పై రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన మిషన్ భగీరథ నీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఏఈలు సతీష్, చిరంజీవి, అంజం రాజు, సర్పంచ్‌లు అజ్మీరా అర్జున్, ధరావత్ బాలుతో పాటు రమేష్, పెండ్ర అనిల్ కుమార్ పాల్గొన్నారు.

‘కారు’లో ఐక్యతారాగం దిశగా అడుగులు

- వైరా, భద్రాచలంలో కొంతమేర కొలిక్కి
- ఇల్లెందులో సద్దుమణగని వివాదం
- కేటీఆర్ వచ్చేలోగా అంతా సర్దుకునేలా మంత్రి, ఎంపీల యత్నం



కలహాలు సమసినట్లేనా?!

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌లో కలహాలు సమసిపోయాయా... అనే ప్రశ్నకు పార్టీ వర్గాలు ఔననే సమాధానమిస్తున్నాయి. టికెట్ దక్కక ఒకరు, టికెట్ వచ్చినా నియోజకవర్గ నేతలు సహకరించక ఇంకొకరు ఆందోళనలో ఉండగా.. ఇప్పుడు అంతా ఏకతాటిపైకి వచ్చినట్లేనని చెబుతున్నారు. దీంతో పార్టీ అభ్యర్థులను ప్రకటించాక నెల రోజులకు అసంతృప్తులు దారికి వచ్చినట్లయిందని తెలుస్తోంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు జోక్యంతో ప్రస్తుతానికి అంతా సర్దుకుందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రధానంగా వైరా, భద్రాచలంలో పంచాయితీ ఓ కొలిక్కి రాగా.. ఇల్లెందులో పరిస్థితిలో మార్పు వచ్చిందా, రాలేదా అనేది తేలడం లేదు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ శనివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యాన నేతల ఐక్యతారాగం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వైరాలో కలిసిన చేతులు

ఇటీవల వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాములునాయక్, పార్టీ అభ్యర్థి బానోతు మదన్‌లాల్ మధ్య దళితబంధు జాబితా చిచ్చుపెట్టింది. ఈ పంచాయితీ పార్టీ పెద్దల వరకు చేరగా... తనకు నియోజకవర్గంలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఎమ్మెల్యే బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి మధ్య లొల్లి తారాస్థాయికి చేరడంతో ద్వితీయ శ్రేణి నేతలు కూడా రెండువర్గాలుగా విడిపోయారు. తాజాగా పార్టీ పెద్దల ఆదేశంతో ఖమ్మంలోని ఎంపీ నామా ఇంట్లో రాములునాయక్, మదన్‌లాల్‌తో మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాత మధు సమావేశమయ్యారు. అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి జరిగిన పరిణామాలన్నీ ఈ భేటీలో చర్చకు రాగా, సీఎం ఆదేశాలతో అంతా కలిసి పనిచేయాలని నిర్ణయించి రాములునాయక్, మదన్‌లాల్ చేతులు కలిపారు. దీంతో వైరాలో వివాదం సమసిపోయినట్లేనని నేతలు పేర్కొంటున్నారు.

భగ్గుమని.. ఆపై శాంతించి..

భద్రాచలం టికెట్ డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఇవ్వడంతో పార్టీ నేత బోదబోయిన బుచ్చయ్య వర్గం భగ్గుమంది. పార్టీని కాదని వెళ్లిన వారిని మళ్లీ చేర్చుకుని టికెట్ ఎలా ఇస్తారని వారు మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అనుచరుడైన బుచ్చయ్య తనకే టికెట్ వస్తుందని భావిస్తున్న వేళ వెంకట్రావును ప్రకటించారు. ఈ విషయంలో బాలసాని కూడా గుర్రుగా ఉండడంతో ఆయన అనుచరులు సైతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. పలుమార్లు మంత్రి పువ్వాడ రెండు వర్గాలతో చర్చలు జరపగా, ఐదు రోజుల క్రితం జరిగిన భేటీలో రెండు వర్గాలు ఏకతాటిపైకి వచ్చాయి. వెంకట్రావుతో కలిసి బుచ్చయ్య ప్రచారంలో పాల్గొనాలనే పార్టీ ఆదేశాలకు సరేనడంతో కొంత మేర అసంతృప్తి చల్లారింది. అయితే, బుచ్చయ్య వర్గం మాత్రం తమ నేతకు టికెట్ రాలేదన్న ఆవేదనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కేటీఆర్ వస్తున్న వేళ

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈనెల 30న ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఇప్పటివరకు ఖమ్మంలో పర్యటనకు సంబంధించి షెడ్యూల్ విడుదల కాగా, భద్రాచలం, సత్తుపల్లి, వైరా నియోజవర్గాల్లో కూడా పర్యటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈమేరకు ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. టికెట్లు ప్రకటించి నెల దాటిన నేపథ్యాన ఆయన పార్టీ అభ్యర్థులు, ముఖ్య నేతలతో ఇప్పటివరకు చేసిన ప్రచారం, భవిష్యత్ ప్రణాళికపై కొద్దిసేపు చర్చించే అవకాశముంది. కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయడమే కాక నేతల మధ్య అసంతృప్తి లేకుండా చూసే పనిలో ముఖ్య నేతలు నిమగ్నమయ్యారు.

హాట్‌హాట్‌గా ఇల్లెందు

ఇల్లెందులో సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దని ఆమె వ్యతిరేక వర్గం కోరింది. కానీ అధిష్టానం హరిప్రియ వైపే మొగ్గు చూపడంతో అసమ్మతి వర్గం నిరాశకు గురైంది. అనంతరం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలను ఎంపీ వద్దిరాజుకు అప్పగించారు. ఆయన ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావుతో పలుమార్లు చర్చలు జరిపారు. తమ ప్రతిష్టకు భంగం కలిగించారంటూ ఎవరికి వారు చర్చల్లో ఏకరువు పెట్టారు. ఇదిలా ఉండగా ఇన్నాళ్లు ఉప్పునిప్పులా ఉన్న ఇల్లెందు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు వెంకటేశ్వరరావు, జానీపాషా ఒక్కటైనట్లు ప్రకటనలు విడుదల చేశారు. అయితే, నియోజకవర్గ ముఖ్యనేతలు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెబుతున్నా నియోజకవర్గ కార్యక్రమాల్లో ఎడమొహం.. పెడమొహంగానే ఉంటున్నారు.

రేపు ఖమ్మంకు కేటీఆర్

- రూ.1,369 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- మున్నేరుపై ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన
- సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభోత్సవం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శనివారం ఖమ్మం రానున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన ఖమ్మంలో రూ.1,362.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. ప్రధానంగా మున్నేరుపై ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్, సస్పెన్షన్ బ్రిడ్జితోపాటు అమృత్ 2.0 పథకం కింద అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు ఖమ్మంలో మంత్రుల పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది.

ఆర్‌సీసీ వాల్.. సస్పెన్షన్ బ్రిడ్జి..

ఈ ఏడాది జూలైలో మున్నేరుకు వరద పోటెత్తింది. కనీవినీ ఎరుగని రీతిలో వరద రావడంతో మున్నేరులో దాదాపు 30.06 అడుగులకు చేరింది. దీంతో మున్నేరు పరీవాహక ప్రాంతంలోని ఇళ్లన్నీ నీట మునిగాయి. అయితే, భవిష్యత్‌లో మున్నేరుకు ఇదే రీతిలో వరద వస్తే మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి రూ.690.52 కోట్ల నిధులు విడుల చేసింది. అలాగే, మున్నేరుపై తీగల వంతెన నిర్మాణానికి ఈ ఏడాది జనవరిలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇవ్వగా నిధులు కేటాయిస్తూ జీఓ విడుదలైంది. దీంతో రూ.180 కోట్లతో నిర్మించే సస్పెన్షన్ బ్రిడ్జితో పాటు ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ పనులకు మంత్రులు కేటీఆర్, అజయ్ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. అంతేకాకుండా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్‌ఐడీసీ) ద్వారా మంజూరైన రూ.100 కోట్ల రుణంతో చేపట్టే అభివృద్ధి పనులకు కేటీఆర్ కేఎంసీ కార్యాలయం వద్ద శంకుస్థాపన చేస్తారు. అలాగే, నగరంలోని గట్టయ్య సెంటర్‌లో నిర్మించిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, లకారం ట్యాంక్ బండ్ వద్ద ఎన్టీఆర్ పార్క్, 20వ డివిజన్‌లోని టర్ఫ్ కోర్టు, గోళ్లపాడు చానల్‌పై అండర్‌గ్రౌండ్ పైపులైన్‌ను కూడా ప్రారంభించనున్నారు.

మంత్రుల పర్యటన షెడ్యూల్ ఇలా..

శనివారం ఉదయం 9.30 గంటలకు రూ.690.52 కోట్లతో మున్నేరుపై నిర్మించనున్న ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ పనులకు మున్నేరు బ్రిడ్జి వద్ద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత రూ.180 కోట్లతో మున్నేరుపై నిర్మించే సస్పెన్షన్ బ్రిడ్జికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.108.71 కోట్లతో నిర్మించిన గోళ్లపాడు చానల్, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీని ప్రకాష్‌నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ పార్క్ వద్ద ప్రారంభిస్తారు. ఆతర్వాత 20వ డివిజన్‌లో రూ.71 లక్షలతో నిర్మించిన టర్ఫ్ కోర్టు, రూ.1.37 కోట్లతో లకారం వద్ద నిర్మించిన ఎన్టీఆర్ పార్క్‌ను ప్రారంభిస్తారు. అలాగే రూ.10 కోట్లతో నిర్మించే లకారం అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, అమృత్ 2.0 కింద రూ.249.50 కోట్లతో నిర్మించే అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు లకారం వద్ద శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రూ.8.54 కోట్లతో గట్టయ్య సెంటర్‌లో నిర్మించిన వెజ్ అండ్‌నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించనున్న మంత్రులు... ఆతర్వాత ఎల్‌ఆర్‌ఎస్ రెండో విడత నిధులు రూ.20 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు కేఎంసీ వద్ద శంకుస్థాపన చేస్తారు. అలాగే, టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా మంజూరైన రూ.100 కోట్ల రుణంతో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా కేఎంసీ వద్దే శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 11.30 గంటలకు కేఎంసీలో జరిగే పట్టణ ప్రగతి నివేదన సమావేశంలో మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్ పాల్గొంటారు.

జాషువా అవార్డు అందుకోవటం గర్వంగా ఉంది

కవి, విమర్శకులు కొలకలూరి ఇనాక్



ఇనాక్‌ను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: అణగారిన వర్గాలు, సబ్బండ వర్గాల బాధలను తనదైన శైలిలో స్ఫూర్తివంతంగా రాసిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పేరిట ఏర్పాటుచేసిన ‘మన కాలపు జాషువా’ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని ప్రముఖ కథకుడు, విమర్శకులు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా గురువారం జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యాన ఖమ్మం జెడ్పీ హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇనాక్‌కు అవార్డు అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ కుల వివక్షను స్వయంగా ఎదుర్కొని బ్రాహ్మణీయ భావజాలాన్ని తిరస్కరించిన కవి గుర్రం జాషువా అని తెలిపారు. ఈనాటి సమాజం, బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తిప్రదాతగా కొనియాడారు. కాగా, జాషువా సాహిత్య వేదిక ద్వారా సాహిత్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తుండడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని సాహిత్యం ద్వారా ప్రకటించిన గుర్రం జాషువా సభలో పాల్గొనటం స్ఫూర్తిని కలిగించిందన్నారు. ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ ఖాసిం మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఇనాక్ బహుజనుల కోసం అనేక రచనలు చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లుతోపాటు కవి, విమర్శకులు జి.లక్ష్మీనర్సయ్య, రచయిత వురిమళ్ల సునంద తదితరులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం చేసేందుకే గృహలక్ష్మి



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్, కార్పొరేటర్లు, నాయకులు

- గ్యారంటీ కార్డులను నమ్మి మోసపోవద్దు
- కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపిస్తే మరింత అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: నిల్వ నీడ లేని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా మహిళల పేరుతోనే మంజూరు పత్రాలు ఇస్తూ వారి ఖాతాల్లోనే నగదు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన 223 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లాలో సొంత స్థలం కలిగిన 15వేల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి జరగనుందని తెలిపారు. నియోజకవర్గానికి మూడు వేల మందిని ఎంపిక చేయగా, ఖమ్మం నియోజకవర్గానికి అదనంగా మరో వెయ్యి యూనిట్లు కేటాయించారని చెప్పారు. మూడు దశల్లో రూ.3లక్షల నగదు అందుతుందని తెలిపారు. కాగా, కొందరు గ్యారంటీ కార్డులంటూ వస్తున్నారని, వారిని నమ్మి ప్రజలుమోసపోవద్దని సూచించారు. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పనికి రాకుండా పోయాయని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు వచ్చినా చేసేదేం ఉండదని గుర్తించి, మరింతగా అభివృద్ధి జరిగేందుకు సీఎం కేసీఆర్‌ను మూడో మారు గెలిపించాలని అజయ్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, కార్పొరేటర్లు రాపర్తి శరత్, బుర్రి వెంకట్‌కుమార్, పగడాల శ్రీవిద్య నాగరాజు, మోతారపు శ్రావణి సుధాకర్, పైడిపల్లి రోహిణి సత్యనారాయణ, ధనాల రాధ, మందడపు లక్ష్మీమనోహర్, కమర్తపు మురళి, పాకాలపాటి విజయనిర్మల శేషగిరిరావు, కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, షేక్ మక్బూల్, దండా జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంటే లెక్క లేదా?

- సమస్యలకు నిలయాలుగా గురుకులాలు, రెసిడెన్షియల్ కాలేజీలు
- సౌకర్యాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- అరకొర వసతులతో విద్యార్థుల ఇక్కట్లు
- తాజాగా వైరాలో ఎలుకల దాడి

- జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రఘునాథపాలెం బీసీ గురుకులంలో 392 మంది విద్యార్థులు ఉన్నారు. అద్దె భవనంలో సాగుతున్న గురుకులంలో బోధన, వసతి ఒకేచోట ఏర్పాటుచేశారు. కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకునేందుకు విద్యార్థులు అర్ధరాత్రి గోడ దూకి వెళ్లారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బయట భవనం బాగానే కనిపిస్తున్నా లోపల అసౌకర్యాలు విద్యార్థులను వేధిస్తున్నాయి.
- జిల్లాలో రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు రెండు ఉన్నాయి. వైరాలో బాలికలు, ఏన్కూరులో బాలుర జూనియర్ కళాశాలలు ఉండగా... ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో వీటిని నిర్వహిస్తారు. నాణ్యమైన విద్య, వసతి ఉంటుందని తల్లిదండ్రులు టీఎస్‌ఆర్‌జేసీ సెట్ రాయించి పిల్లలను చేర్పిస్తుంటారు. వైరా బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో 587 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల ఆరుగురు విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. విద్యార్థినులు నిద్రించే గదిలోకి ఎలుకలు రావడానికి నిర్వహణలో లోపాలే కారణమని తెలుస్తోంది.

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని పేద విద్యార్థుల సంక్షేమం అటు పాలకులు, ఇటు అధికారులకు పట్టడం లేదు. పిల్లల చదువు తలిదండ్రులకు భారం కావొద్దనే భావనతో నాణ్యమైన ఉచిత వసతితో పాటు విద్యనందించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ఆధ్వర్యాన ప్రభుత్వం అన్ని మండల కేంద్రాల్లో గురుకులాలను ఏర్పాటుచేసింది. ఇవేకాక జిల్లాలో రెండు రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.కోట్ల నిధులు కేటాయిస్తోంది. ఇదంతా ఓ కోణం కాగా... దాదాపు అన్ని గురుకులాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఉన్నతాధికారుల అలసత్వం, ఉద్యోగుల ఇష్టారాజ్యంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలున్నాయి. ఇక వసతి కల్పనలోనూ సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. బీసీ గురుకులాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. భోజనం, వసతి సక్రమంగా లేకపోయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు.

అద్దె భవనాలతో సమస్యలు

అన్ని సంక్షేమ శాఖల ఆధ్వర్యాన గురుకులాలు మంజూరు చేసినా పక్కా భవనాలు లేక దాదాపు అన్నీ అద్దెభవనాల్లోనే నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల వసతి, బోధన ఒకే గదిలో సాగుతుండగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకొన్ని గురుకులాల్లో స్నానాల గదులు, వాష్ రూమ్‌లు, పరిసరాలు అధ్వాన్నంగా కనిపిస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు.



వైరాలోని గురుకుల పాఠశాల

ఆర్సీవోలు తోచినప్పుడు తనిఖీ చేస్తూ విద్యార్థుల సమస్యలను గాలికొదిలేస్తున్నట్లు తెలుస్తోంది. సమస్యలు ఉన్నాయని చెప్పే విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అధికారులు ఆదేశించినట్లు సమాచారం. కలెక్టర్ పలు గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించారు. ఈ సమయంలో సమస్యలు చెప్పకుండా ఒత్తిడి తీసుకొచ్చారని సమాచారం. గతంలో ఒకటి, రెండు దశల్లో సీట్లు భర్తీ కాగా.. ఇప్పుడు సెప్టెంబర్ వచ్చినా గురుకులాల్లో సమస్యల కారణంగా సీట్లు ఇంకా ఖాళీగానే ఉండడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో గురుకులాలు, విద్యార్థుల సంఖ్య

శాఖ	గురుకులాలు	విద్యార్థులు
ఎస్సీ	24	13,900
బీసీ	26	14,000
ఎస్టీ	27	12,115
మైనార్టీ	26	9,600

సొంత భవనాలు లేకే...



గురుకులాలు, వసతిగృహాలకు సొంత భవనాలు లేకపోగా.. ఉన్నచోట శిథిలమయ్యాయి. కనీస వసతులు లేని అద్దె భవనాల్లో గురుకులాలు నిర్వహిస్తున్నారు. వైరా గురుకులంలో విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – వి.వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్‌సీఓల పర్యవేక్షణ లేమితోనే...



గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.30లక్షల మేర వెచ్చిస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ఫలితముండడం లేదు. గురుకులాల్లో సమస్యలతో విద్యార్థులకు కడుపు నిండా భోజనం, కంటినిండా నిద్ర ఉండడం లేదు. ఆర్సీఓల పర్యవేక్షణ లేమితో ఈ పరిస్థితి నెలకొంది. ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

డీసీసీబీలో 14 మందికి ఉద్యోగోన్నతి

- ముగ్గురికి మేనేజర్లుగా, 11 మందికి అసిస్టెంట్ మేనేజర్లుగా అవకాశం
- రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్



ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో 14 మంది ఉద్యోగులకు పదోన్నతి లభించింది. ఇందులో ముగ్గురికి మేనేజర్లుగా, 11 మందికి అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. వీరికి రెండు, మూడు రోజుల్లో పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. బ్యాంకులో ఒక అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం), ముగ్గురు మేనేజర్లు, 14 మంది అసిస్టెంట్ మేనేజర్లుగా మొత్తం 18 మందికి ఇన్ సర్వీస్ కేటగిరీ ద్వారా పదోన్నతి కల్పించాలని పాలకవర్గం నిర్ణయించగా.. నిబంధనలు, అర్హతల ఆధారంగా 14 మందికి అవకాశం లభించింది. తొలుత రాతపరీక్షను ముంబైలోని ఐబీపీఎస్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ పర్సనల్ సెలక్షన్) ద్వారా ఈ నెల 10వ తేదీన నిర్వహించారు. ఇక డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అధ్యక్షుడిగా, టస్కాబ్ అధికారి వివేక్, డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరబాబు, డైరెక్టర్ పునుకొల్లు రాంబ్రహ్మం సభ్యులుగా కమిటీని నియమించి రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఒక్కో పోస్టుకు ఐదుగురు చొప్పున ఉద్యోగులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ మేరకు అసిస్టెంట్ మేనేజర్లుగా పనిచేస్తున్న ఇందు, సతీశ్, మమతకు మేనేజర్లుగా, స్టాఫ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న రేష్మ, శరత్ చంద్రిక, నిరీష, చరిష్మా, శిరీష, కృష్ణవేణి, సునీల, బాలకృష్ణ, ఉదయ్, ప్రార్థన విజయ, సుధాకర్‌కు అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి లభించింది. ఇక ఎస్టీ కేటగిరీలో మూడు పోస్టులు ఉన్నా అర్హులు లేకపోవడంతో పక్కన పెట్టారు. అలాగే, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం)గా పదోన్నతి రాష్ట్ర బ్యాంకు(టస్కాబ్) ఆధ్వర్యాన కల్పించాల్సి ఉంది.

క్లుప్తంగా

మహాగణపతి పీఠం లడ్డూ.. రూ.2లక్షలు



లడ్డూతో మలిరెడ్డి మురళి తదితరులు

సత్తుపల్లి/సత్తుపల్లి టౌన్: సత్తుపల్లి జేవీఆర్ పార్క్ ఎదురుగా శ్రీ మహాగణపతి ఆలయంలోని మహాగణపతి పీఠం విగ్రహం పూజలందుకున్న లడ్డూకు వేలంలో పోటీ నెలకొంది. సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో గురువారం రాత్రి వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, మలిరెడ్డి మురళి రెడ్డి రూ.2 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే, శ్రీ కోదండ రామాలయంలోని వాసవీ గణపతి లడ్డూను న్యాయవాది సోమిశెట్టి శ్రీధర్ మిత్రబృందం రూ.1,20,116కు కైవసం చేసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, గణేష్, గుండు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పోకూరి కృష్ణ ప్రసాద్, వందనపు సత్యనారాయణ, నడిపల్లి లక్ష్మీనారాయణ, పోలిశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూ.. రూ.45,116

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ ఇంటి ఎదురుగా ప్రతిష్ఠించిన గణనాథుడి చేతిలోని లడ్డూ దక్కించుకునే భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా గురువారం వేలం నిర్వహించగా డివిజన్‌కు చెందిన గోళ్ల పుల్లమ్మ రూ.45,116కు కైవసం చేసుకున్నారు.

108 కిలోల భారీ లడ్డూ

తల్లాడ: తల్లాడ మండలంలోని నారాయణపురంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం కమిటీ బాధ్యులు స్వామికి 108 కిలోల భారీ లడ్డూ సమర్పించారు. అనంతరం నిమజ్జనం సందర్భంగా స్వామి విగ్రహంతో పాటు లడ్డూను కూడా వాహనంలో తీసుకెళ్తూ భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఏటా నారాయణపురంలో భారీ లడ్డూను స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

రామాలయ అభివృద్ధికి రూ.1.50 లక్షల వితరణ



విరాళం అందజేస్తున్న ఆజాద్ కుటుంబీకులు

మధిర: మండలంలోని దెందుకూరులో శ్రీ కోదండరామ స్వామి ఆలయాభివృద్ధికి గ్రామానికి చెందిన చుంచు వెంకటేశ్వర్లు ఆజాద్, దుర్గ రూ.1.50 లక్షలు వితరణగా అందజేశారు. చుంచు అమరయ్య – తిరుపతమ్మ జ్ఞాపకార్థం ఈ నగదును ఆలయ చైర్మన్ చల్లా వెంకటేశ్వరరావుకు గురువారం అందజేయగా, కమిటీ బాధ్యులు అభినందించారు. కార్యక్రమంలో గుర్రం వీరప్రసాద్, గోపాలకృష్ణ, జొన్నలగడ్డ తులసి, కొల్లూరు శ్రీనివాసరావు, గుర్రం భాస్కర్‌రావు, విజయ్, బాబ్జీ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా క్లైమెంట్



ఖమ్మంమయూరిసెంటర్: ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కేఎంసీ కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ ఎన్నికయ్యారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా క్లైమెంట్‌కు స్థానం దక్కింది. ఆయన 1977లో ఏఐఎస్ఎఫ్‌లో, అనంతరం ఏఐటీయూసీలో చేరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశాక 2010 నుంచి రాష్ట్ర సమితిలో కొనసాగుతున్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన ఆయనను సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు నర్సింహారావు, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా క్లైమెంట్ మాట్లాడుతూ బలహీన వర్గాలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు.

సైపన్ మరమ్మతుకు నిధులు

వేంసూరు: మండలంలోని లింగగూడెం చెరువు నుంచి భరణిపాడు కాల్వకు నీరు వెళ్లే మార్గంలో సైపన్ బావి కూలిపోయింది. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. స్థానిక రైతులు గురువారం విషయాన్ని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సైపన్ బావి మరమ్మతుకు రూ.1.17 లక్షలు అందజేశారు.

బిర్యానీలో దారం, మేకులు!

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో గురువారం కొందరు యువకులు బిర్యానీ తినేందుకు రాగా అందులో దారం, మేకులు వచ్చాయని సమాచారం. దీంతో వారు ఆహార తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయమై జిల్లా ఆహార తనిఖీ అధికారిని వివరణ కోరగా బిర్యానీలో దారం వచ్చినట్లు కొందరు ఫోన్ చేశారని.. కాసేపటికే మళ్లీ ఫోన్ చేసి యాజమాన్యంతో రాజీ కుదుర్చుకున్నందున ఫిర్యాదు వెనక్కి తీసుకుంటున్నట్లు చెప్పారన్నారు. కాగా, రెస్టారెంట్ యజమాన్యం సదరు యువకులు ఆర్డర్ చేసిన ఆహారానికి బిల్లు తీసుకోకుండా రాజీ చేసుకున్నారని తెలిసింది.

ప్రశాంతంగా గణనాథుడి నిమజ్జనం

- గురువారం ఉదయం వరకు నిమజ్జనం పూర్తి
- పోలీసుల నిఘా, ఏర్పాట్ల నడుమ సవ్యంగా సాగిన క్రతువు



మున్నేరులో పూర్తిగా మునగని వినాయక విగ్రహాలు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలో గణనాథుడి నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. వినాయక మండపాల నిర్వాహకులు ఎక్కువ మంది బుధవారమే ప్రతిమలను నిమజ్జనం చేయగా పలుచోట్ల గురువారం కూడా చేశారు. ప్రధానంగా జిల్లా కేంద్రంలో గణపతి శోభాయాత్ర, నిమజ్జనం కనుల పండువగా సాగింది. స్తంభాద్రి ఉత్సవ సమితి, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో బుధవారం మధ్యాహ్నం నుంచి శోభాయాత్ర మొదలుపెట్టారు. సాయంత్రం మున్నేరులో నిమజ్జనాన్ని ప్రారంభించారు. కాగా, బస్‌డిపో రోడ్, పొట్టి శ్రీరాములు రోడ్, శ్రీనివాసనగర్, ముస్తఫానగర్, రాపర్తినగర్, కాల్వొడ్డు తదితర ప్రాంతాల్లో 20 నుంచి 30 అడుగులకు పైగా ఉన్న విగ్రహాలను తరలించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాగే, బస్ డిపో వద్ద, గ్రంథాలయం వద్ద ఓ భారీ విగ్రహం తరలింపులో సమస్య ఎదురుకాగా పోలీసులు సహకరించారు. బుధవారం రాత్రి 9 గంటలు దాటాక పెద్దసంఖ్యలో విగ్రహాలు కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్ నిమజ్జన ఘాట్ల వద్దకు చేరుకున్నాయి. ఇక నగరంలోని బ్రాహ్మణబజార్ శివాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని గురువారం తెల్లవారుజామున 4 గంటలకు నిమజ్జనం చేశారు. బుధ, గురువారాల్లో ఖమ్మంలోని మున్నేరులో 900కు పైగా విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు అధికారులు, స్తంభాద్రి ఉత్సవ సమితి బాధ్యులు వెల్లడించారు.

నిఘా నీడలో..

ఖమ్మంలోని వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అలాగే, ఇతర శాఖల అధికారుల ఆధ్వర్యాన ఏర్పాట్లు చేయగా అంతా సవ్యంగా సాగింది. నిమజ్జన ఘాట్ వద్ద 16 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసిన పోలీసులు పుటేజీలు నిరంతరం పరిశీలిస్తూ శోభాయాత్ర నిలిచినా, ఆలస్యమవుతున్నా అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభిలతో పాటు స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు పర్యవేక్షించారు. ఇక మున్నేరు నిమజ్జన ప్రాంతంలో 250 హైమాస్ట్ లైట్లు, రెండు జనరేటర్లను ఏర్పాటు చేయగా వైద్యశిబిరం, క్రేన్ల ఏర్పాటు, గత ఈతగాళ్లను నియమించడంతో ఎలాంటి అవాంతరం ఎదురుకాకుండా నిమజ్జనం సాఫీగా ముగిసింది.

ఫ్రేమ్‌ల కోసం వెతుకులాట

గణపతి నిమజ్జనం అనంతరం గురువారం ఉదయమే కొందరు విగ్రహాలకు అమర్చిన ఫ్రేమ్‌ల కోసం మున్నేరులో వెతగడం కనిపించింది. విగ్రహాల అడుగు భాగాన అమర్చిన ఇనుప ఫ్రేమ్‌లను తీసుకెళ్లారు. ఖమ్మం కాల్వొడ్డు, ప్రకాష్ నగర్ మున్నేరులో పలువురు వెతులాడుతూ కనిపించారు. ఇక మున్నేరులో భక్తులు నిమజ్జనం చేసిన కొన్ని విగ్రహాలు పూర్తిగా మునగలేదు. పలు విగ్రహాలు నీటిపై తేలుతూ కనిపించగా.. అధికారులు స్పందించి విగ్రహాలను మరింత లోతుకు తరలించాలని భక్తులు కోరుతున్నారు.



విగ్రహాల ఫ్రేమ్‌ల నుంచి ఇనుప రాడ్లు తీసుకెళ్తున్న స్థానికులు



కానుకలు, చువ్వల కోసం వెతుకుతున్న చిన్నారులు



శోభాయాత్రలో ఉపయోగించిన కొబ్బరి మట్టల నుంచి పుల్లలు తీస్తున్న మహిళ

గృహలక్ష్మితో మహిళలకు గౌరవం

- ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- సత్తుపల్లి మండలంలో 589 మందికి మంజూరు పత్రాలు



సత్తుపల్లి : గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదల కోసం సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని ప్రకటించారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఈ పథకాన్ని మహిళల పేరిట మంజూరు చేయనుండడంతో వారిని గౌరవించుకున్నట్లవుతుందని చెప్పారు. సత్తుపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని 589 మంది లబ్ధిదారులకు ఆయన గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. లబ్ధిదారులు సత్వరమే ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఈ పథకంలో అక్రమాలు జరగకుండా మహిళల అకౌంట్లలో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. కాగా, ఇప్పుడు హామీలు ఇస్తున్న కాంగ్రెస్ నేతలు వారు అధికారంలో ఉన్నప్పుడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలను ఎందుకు అమలుచేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. అన్నివర్గాల ప్రజల కోసం పథకాలు అమలుచేస్తున్న కేసీఆర్‌ను మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా హైమావతి, జెడ్పీటీసీ కె.రామారావుతో పాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, గోగులమూడి బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు అభివృద్ధి ఎందుకు చేయలేదు?

తల్లాడ: రాష్ట్రాన్ని పాలించినప్పుడు కాంగ్రెస్ నేతలు అభివృద్ధి ఎందుకు చేయలేదో చెప్పాకే ప్రజల్లోకి రావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. పాలించినప్పుడు ఏమీ చేయకుండా కొత్త హామీలతో వస్తున్న ఆ పార్టీ నేతలను ప్రజలు నిలదీయాలని కోరారు. తల్లాడ మండలం మంగాపురం, నారాయణపురం, తల్లాడ, అంజనాపురం, నూతనకల్, వెంగన్నపేటల్లో గురువారం రూ.35కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారులు, బ్రిడ్జిలు, కమ్యూనిటీ హాల్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే, నారాయణపురంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశాక మాట్లాడారు. ఎన్నికల వేళ హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక విస్మరించడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని ఆరో పించారు. కానీ, కేసీఆర్ మాత్రం పట్టణం, పల్లె తేడా లేకుండా రూ.వందల కోట్ల నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, డీసీఓ విజయకుమారి, సీఈఓ వీరబాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ హేమలత, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీదేవి, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అశోక్, తాజుద్దీన్, డి.భద్రరాజు, వెంకట్‌లాల్, దగ్గుల శ్రీనివాసరెడ్డి, దిరిశాల దాసు రావు, పొట్టేటి సంధ్యారాణి, వరపర్ల ఉమాఉదయ్, కె.విద్యాసాగర్, తూము వీరభద్రరావు, శ్రీనివాసరావు, కేతినేని చలపతిరావు, శీలం కోటారెడ్డి, కోడూరి వీరకృష్ణ, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, కటికి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ : రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సండ్ర

అండర్-19 ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు

ఖమ్మంస్పోర్ట్స్: జూనియర్ కళాశాలల స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్- 19 ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 31మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అండర్- 19 క్రీడల కార్యదర్శి ఎండీ మూసాకలీం, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ పోటీలను పర్యవేక్షించి జట్టు వివరాలను వెల్లడించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు విజయ్‌బాబు, విక్రమ్, నితిన్, ఉదయ్‌కుమార్, నగేశ్, విష్ణువర్ధన్, సన్నె ఆదిత్య, లక్ష్మణ్, వినయ్‌కుమార్, చక్రి, నితిన్, సనత్‌చంద్ర, వినీల్, గుణశేఖర్, రవీందర్, నివాస్ ఎంపిక కాగా, ఈ నెల 30నుంచి సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

చేతిలో బాంబు పేలి వ్యక్తికి గాయాలు

కొణిజర్ల: మండల కేంద్రంలో గురువారం వినాయక నిమజ్జనం కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. బాణసంచా పేలుస్తున్న క్రమాన కొణిజర్లలోని రాయల్ ఫ్యాన్సీ యజమాని రాయల నాగయ్య చేతిలో బాంబు పేలడంతో చేతి వేళ్లు పూర్తిగా తెగిపోయాయి. అలాగే, అరచేయి నుజ్జునుజ్జు కావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

గొర్రెలకు బదులు నగదు పంపిణీ చేయాల్సిందే..



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరాపర్తినగర్: గొర్రెల పంపిణీ పథకంలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా నగదు బదిలీ అమలు చేయాలని అఖిలపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. ఖమ్మంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం అఖిలపక్షం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన మహాధర్నా సందర్భంగా జీఎంపీఎస్ నాయకులపై పెట్టిన కేసులు తొలగించాలని, వచ్చేనెల 3న అఖిలపక్షం ఆధ్వర్యాన కలెక్టర్‌ను కలవాలని నిర్ణయించారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో 17 వేల మంది గొల్ల, కురుమలు డీడీలు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా గొర్రెలు పంపిణీ చేయకపోవడం గర్హనీయమన్నారు. ఇకనైనా డీడీలు తిరిగి ఇచ్చేసి, పథకాన్ని నగదు బదిలీ రూపంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం, ప్రజాపంథా జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అల్లిక వెంకటేశ్వరరావు, సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ నాయకులు మేకల శ్రీనివాసరావు, గంగరాజు, మీగడ రామారావు మాట్లాడగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎర్రా శ్రీకాంత్‌తో పాటు మాదినేని రమేశ్, వాసిరెడ్డి వరప్రసాద్, గుడవర్తి నాగేశ్వరరావు, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పెనుబల్లి: వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టగా కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న మరోకారును ఢీకొట్టడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. పెనుబల్లి మండలం గౌరారం టోల్‌ప్లాజా సమీపాన గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవతలగుట్ట వద్ద ఉన్న శివాలయంలో పూజలు చేసిన భక్తులు పలువురు చంద్రుగొండ మండలం తిప్పనపల్లి వైపు కారుతో వెళ్తున్నారు. ఈ సమయాన పెనుబల్లి నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న సింగరేణి వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు అదుపు తప్పి ఎర్రగుంట నుంచి పెనుబల్లి వైపు వస్తున్న ఇంకో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసం కాగా నలుగురు మహిళలతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల్లో తిప్పనపల్లికి చెందిన రామిశెట్టి శ్రీను పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన సింగరేణి వ్యాన్‌ను డ్రైవర్ ఆపకుండా వెళ్తుండడంతో స్థానికులు వెంబడించి చంద్రుగొండ పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలాన్ని వీఎం బంజర్ ఎస్ఐ జి.సూరజ్ పరిశీలించారు.

దంపతులపై దాడి

నేలకొండపల్లి: పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని దంపతులపై దాడి చేయడమే కాకుండా చంపుతామని బెదిరించిన ఘటన చోటు చేసుకుంది. మండలంలోని కొత్తకొత్తూరుకు చెందిన ఉపేంద్రబాయి, రఘుసింగ్ దంపతులపై అదే గ్రామానికి చెందిన చైతన్యసింగ్, గణేశ్‌సింగ్ బుధవారం దాడికి పాల్పడ్డారు. డబ్బు విషయమై పాతకక్షలను దృష్టిలో పెట్టుకుని తమపై దాడి చేయడమే కాక చంపుతానని బెదిరించారని వారు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


భూ సర్వేకు వెళ్లిన దంపతులపై దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో భూసర్వే కోసం వెళ్లిన దంపతులపై అదే ప్రాంతానికి చెందిన పలువురు దాడి చేశారన్న ఫిర్యాదుతో గురువారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలాజీనగర్‌కు చెందిన కొల్లు మాధవరావు – పద్మ దంపతులు కైకొండాయిగూడెంలో ఎకరం భూమి కొనుగోలు చేశారు. ప్రైవేట్ సర్వేయర్‌తో గురువారం వెళ్లగా కైకొండాయిగూడెంనకు చెందిన ఎస్.శ్రీను, ఉపేందర్, అశోక్, ముత్తయ్య, వీర్రాజు, సింహం, నారాయణ తదితరులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం సమీపాన గురువారం రైలు నుంచి జారి పడిన గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపారు. రైల్వే పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ సభ్యులు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...



కమల్‌నాయక్ (ఫైల్)

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం మామిళ్లగూడెంనకు చెందిన ధరావత్ కమల్‌నాయక్(29) వైరా మండలంలోని పినపాకలో భార్యతో కలిసి ఉంటున్నాడు. బుధవారం రాత్రి ఖమ్మంలో వినాయక నిమజ్జనం ముగిశాక ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లే క్రమాన రాపర్తినగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, కమల్ ప్రమాదవశాత్తు వాహనం పైనుంచి పడ్డాడా, ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనేది తెలుసుకునేందుకు సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నట్లు ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..



రామకృష్ణ (ఫైల్)

మధిర: అడ్తీ యజమాని తన అప్పు చెల్లించాలని అడిగే క్రమాన అసభ్య పదజాలంతో దూషించడనే మనస్తాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మధిర బంజారా కాలనీకి చెందిన మేళ్లచెరువు రామకృష్ణ(38) నందిగామ రోడ్డులోని ఒక కట్టెల అడితిలో పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అడితి యజమాని వద్ద అప్పుగా తీసుకున్న డబ్బు చెల్లించలేదు. దీంత డబ్బు ఇవ్వాలని అడిగే క్రమాన యజమాని దూషించాడని చెబుతూ రామకృష్ణ ఈనెల 16న పురుగుల మందు తాగాడు. ఆయనను భార్య కృష్ణవేణి మధిర ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. తన భర్త మృతి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కృష్ణవేణి ఫిర్యాదు చేసిందని మధిర టౌన్ ఎస్సై రాజేష్ తెలిపారు. కాగా, అడితి యజమాని పెట్టిన ఇబ్బందులను రామకృష్ణ చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మోతె: బైక్‌కు వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఖమ్మం రిక్కా బజారుకు చెందిన సుతారి మేస్త్రీ మురళి(35) గురువారం సూర్యాపేటలోని తన బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు హాజరై తిరిగి ఖమ్మంకు బైక్‌పై బయలుదేరాడు. సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెం లోని మసీదు వద్ద జాతీయ రహదారి(365బీబీ)పై బైక్‌కు వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో మురళి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకొన్నట్లు మోతె ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రూ.10 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఖమ్మంరూరల్: ముదిగొండ మండలంలోని చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.10 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ముదిగొండ మండలం వల్లభి వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపగా అందులోని ఇద్దరు పారిపోయేందుకు యత్నించారు. దీంతో వారిని పట్టుకుని కారును సోదా చేయగా 44.825 కేజీల ఎండు గంజాయి లభించింది. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు గాను కారులో వరంగల్ జిల్లాకు తరలిస్తున్నట్లు తేలిందని ఏసీపీ తెలిపారు. ఒడిశా రాష్ట్రం చింతకుంట మండలం రోన్యగూడకు చెందిన వంత బలరామ్, ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాలగడ్డకు చెందిన కులదీప్‌కిశోర్‌ను అదుపులోకి తీసుకుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారి నుంచి కారు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రాజిరెడ్డి, ముదిగొండ ఎస్ఐ జి.నరేశ్ పాల్గొన్నారు.

ఎంఎస్.స్వామినాథన్ మృతిపై సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మంవ్యవసాయం: ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు ఎం ఎస్.స్వామినాథన్ మృతిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. కోట్ల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపి దేశానికి ఆహారభద్రత కోసం పరితపించిన గొప్ప వ్యక్తి స్వామినాథన్ అని వారు కొనియాడారు. అలాగే, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, డీఏఓ బి.సరిత, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.అనసూయ, ఏడీఏలు ఎ.శ్రీనివాసరావు, కొంగర వెంకటేశ్వరరావు, విజయచంద్ర, బాబూరావు, నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారుల సంఘం ప్రతినిధులు ఐ.భాస్కర్‌రావు, వి.శ్రీనివాసరెడ్డితో పాటు పార్టీల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు నున్నా నాగేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, కొండపర్తి గోవిందరావు, రాణాప్రతాప్ తదితరులు కూడా స్వామినాథన్ మృతిపై సంతాపం ప్రకటించారు.